
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- రాత్రికి రాత్రి పార్టీ మారి బీబీపాటిల్ ద్రోహం చేశారు
- వందరోజుల్లో 280 మంది రైతుల ఆత్మహత్యలు దురదృష్టం
- ఆడబిడ్డలకు రూ.2500 ఇస్తామని రూ.10వేలు బాకీ పడిన రేవంత్ సర్కార్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్ రావు
- కామారెడ్డి, లింగంపేట్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | NIZAMABAD



రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పార్టీ మారినోళ్లను మళ్లీ చేర్చుకునేదే లేదు

# గులాబీ జెండా ఎగురవేద్దాం





కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

నిజామాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి/ఎల్లారెడ్డి : జహీరాబాద్ లోక్ సభ స్థానంపై గులాబీ జెండాను ఎగుర వేసేందుకు బీఆర్ఎస్ సైనికులంతా కష్టపడి పని చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. మొదట్నుంచి బీఆర్ఎస్‌కు కామారెడ్డి కొండంత అండగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని కోరా రు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రో జులు పూర్తయినప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఫేక్ వార్తలు, లీకులతోనే కాంగ్రెస్ సర్కారు కాలక్షేపం చేస్తున్నదని దుయ్యబట్టారు. డిసెంబర్ 9 నాడే రూ.2లక్షల రుణమాఫీ చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు మాటెత్తడం లేదని ప్రశ్నించారు. రైతులంతా ఈ మోసాలను గ్రహించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు లింగంపేట్ మండల కేంద్రంలో జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ముఖ్య నేతలతో పాటుగా నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమరుల త్యాగాలను, కామారెడ్డికి చెందిన పోలీస్ కిష్టయ్య ప్రాణ త్యాగాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేసుకున్నారు.

## కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధిచెప్పాలి

మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. చావునోట్లో తల పెట్టి కేసీఆర్ తెలంగాణ తెచ్చారని కానీ రేవంత్ రెడ్డి మాత్రం తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా ఒక్కసారి కూడా జై తెలంగాణ అనలేదని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడం లేదన్నారు. తెలంగాణలో ఐదేండ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని ఈ సమయంలో వీడుతున్న వారిని భవిష్యత్తులో తిరిగి తీసుకునేదే లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలే నాయకులుగా ఎదగాలన్నారు. అవకాశాలన్నీ కార్యకర్తలకే దక్కేలా అండగా నిలుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలను కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ మోసాలపై కార్యకర్తలంతా గ్రామాల్లో ప్రజలతో చర్చ నిర్వహించాలని సూచించారు.

## వరికి బోనస్‌పై గ్రామాల్లో నిలదీయాలి

వంద రోజులు దాటిపోయినా ఇచ్చిన హామీల గురించి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం పై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. కుర్చీ ఎక్కేందుకు తొందరపడిన రేవంత్ రెడ్డి... రుణమాఫీ మాత్రం మర్చిపోయిండని ఎద్దేవా చేశారు. పంటలకు బోనస్ ఇచ్చిన తర్వాతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకూ కాంగ్రెస్ ప్రభుత్వం పది వేల రూపాయల బాకీ పడిందన్నారు. ఆడబిడ్డలకు రూ.10వేలు ఇచ్చిన తర్వాతే కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగాలన్నా రు. డిసెంబర్ నుంచే పింఛన్ పెంచి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా వృద్ధులకు రూ.4వేలు పింఛన్ అందడం లేదన్నారు. దేవుళ్లను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. బీజేపీ రాముడి పేరుతో ఓట్ల కోసం ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు.

## వందరోజుల్లో 280 మంది రైతు ఆత్మహత్యలు

కాంగ్రెస్ పార్టీ వంద రోజు పాలనలో 280 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు వార్తలు, లీకులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. లీకులు, ఫేక్ వార్తలతో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి తన అధికారంతో పెద్ద నాయకులను కొనుగోలు చేయవచ్చని, కానీ కార్యకర్తలు, ఉద్యమకారులు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కొనలేడని అన్నారు. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీలు లోయపల్లి నర్సింగరావు, పిప్పిరి ఆంజనేయులు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు నల్లవెల్లి అశోక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, లింగంపేట్‌లో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, ఎనిమిది మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



లింగంపేట్ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ షిండే

## చెత్తంతా బయటికి పోతుంది..

**పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ స్పీకర్**

పదేండ్లుగా ఎంపీగా ఉండి పది పైసల పని చెయ్యని వ్యక్తిగా బీబీ పాటిల్ నిలిచారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బీబీపాటిల్‌కు బీజేపీ నుంచి కూడా మద్దతు లేదన్నారు. ఎంపీగా ఏ ఒక్కనాడు ఒక్క గ్రామంలో కూడా తిరగని వ్యక్తి ఇప్పుడు రాత్రికి రాత్రే పార్టీ మారి బీజేపీ నుంచి టికెట్ తెచ్చుకున్నాడని చెప్పారు. కన్న తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. చెత్తంతా బయటకు పోవడం తమ పార్టీకి మంచిదన్నారు. దేవుడిలాంటి కేసీఆర్‌కు ఎందుకు ఓటు వేయక పోతిమి అని ప్రజలు ఇప్పుడు బాధ పడుతున్నారని తెలిపారు. సాధారణంగా ప్రభుత్వం వచ్చినంక మూడు, నాలుగేండ్లలో ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని కానిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నాలుగు మాసాల్లోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. పదవుల కోసం వచ్చిన స్వార్థపరులే ఈ రోజు పార్టీ మారుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు దొందు దొందేనన్నారు. కారు గుర్తుకు ఓటేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇందుకోసం గులాబీ సైన్యమంతా పాటుపడాలని పోచారం పిలుపునిచ్చారు.



## క్షేత్రస్థాయిలో పరిశీలించి.. మేమున్నామని భరోసానిచ్చి..

ఎల్లారెడ్డి, మార్చి 31: లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు మండలంలోని లింగంపల్లి ఖుర్దు గ్రామంలో ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పలువురు రైతులతో మాట్లాడారు.

**హరీశ్‌రావు : అరే.. పొలం మొత్తం ఎండిపోయిందే.. నీ పేరేంది.. ఎన్ని ఎకరాల పొలం సాగుచేస్తున్నవ్..**

**రైతు** : నా పేరు స్వామి.... నాకు రెండెకరాల పొలం ఉంది

**పొలం ఎందుకు ఎండిపోయింది?**

లో వోల్టేజీతో మోటారు కాలిపోయింది. నీళ్లందక పొలం ఎండిపోయింది.

**మోటారు కాలిపోతే ఎంత ఖర్చు అయితది.**

మోటరు రిపేర్‌కు నాలుగు వేలరూపాయల దాక అయితది.

**ఇప్పటికి ఎన్నిసార్లు మోటరు రిపేర్ చేపిచ్చినవ్?**

మూడు సార్లు రిపేర్ చేపిచ్చిన.. 12వేల దాక ఖర్చయింది.

**మరి పంట ఏమన్న చేతికచ్చేటట్టుందా?**

యాడ సార్.... పొట్టకొచ్చిన పొలం నీళ్లందక మొత్తం ఎండిపాయే...

**ఇంతకు ముందు పొలాల పరిస్థితి ఎట్లుంటుండె, ఇప్పుడెట్లుంది....**

అప్పుడు శాన మంచిగుండె.... గింత తక్లీబు కాలే.... కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చినంక రైతుల పరిస్థితి పూర్తిగా అధ్వాన్నమైంది.

### మరో రైతు మంజులతో..

**ఏమమ్మా నీకు ఎంత పొలం ఉంది**

**మహిళా రైతు:** బిగెడున్నర ఉంది సారు

**ఏంది పరిస్థితి?**

పొట్టదశ కొచ్చినంక ఎండిపోయింది.. మా పరిస్థితి మంచిగ లేదు సారు.... మమ్మల్ని ఆదుకోవాలె...

**మొత్తం ఎండిపోయిందా.. ఏమన్నా చేతికస్తదా..**

మొత్తం ఎండిపోయింది సారు.... పెట్టిన పెట్టుబడి మొత్తం పోయింది.

## మాటలతో మభ్యపెట్టిన కాంగ్రెస్, బీజేపీ



ఇటీవల కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేస్తే కాంగ్రెస్, బీజేపీలు అసత్య ప్రచారం, అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెట్టాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరిగింది. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్ స్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్. రాబో యే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

**-గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే**

## ఆశీర్వదించండి..సేవ చేస్తా

జహీరాబాద్ ఎంపీగా ఒకరు ఐదేండ్లు, మరొకరు పదేండ్లు పని చేసినా అభివృద్ధి శూన్యం. ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. నియోజకవర్గ ప్రజలు నన్ను ఆశీర్వదించండి. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందజేస్తా..

**-గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి**





## ఇందిరమ్మ కాలనీలో దాహం.. దాహం

- రంజాన్ పండుగ రోజుల్లో నీటి కష్టాలు
- వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్న కాలనీవాసులు

రెంజల్, మార్చి 31 : మండలంలోని కందకుర్తి గ్రామం ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇబ్బందులతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదిరోజులుగా కుళాయి ద్వారా తాగునీరందడంలేదు. రంజాన్ పండుగ పర్వదినాల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం వినియోగించేందుకు నీరు అందక నానా అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. తమ గోడును పట్టించుకునే వారే కరువయ్యారని అధికారుల తీరుపై మహిళలు మండిపడుతున్నారు. పంచాయతీ నుంచి పరిమితికి మించి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతోపాటు తరచూ లీకేజీలు ఏర్పడడం తమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పనులను వదులుకొని వ్యవసాయ బోరుబావుల నుంచి బిందెల్లో నీళ్లు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పుడే నీటి కొరత ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి ఇబ్బందుల విషయమై గ్రామ కార్యదర్శి సతీశ్ చంద్రను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. నీటి కొరత ఉన్న విషయం వాస్తవమేనని, ప్రతి ఇంటికీ నీరు అందేలా పైపు లైన్‌కు వాల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## 'నవోదయ' ఫలితాలు విడుదల

నిజాంసాగర్, మార్చి 31: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి (2024-25)లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. జనవరి 20 నిర్వహించిన పరీక్షకు 3728 మంది హాజరైనట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ఫలితాలు ఆదివారం విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాల కోసం httpps://cbseit.in/cbse/2024/NVS-RST/Result.aspx లింకుపై క్లిక్ చేసి అడ్మిట్ కార్డు నంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు నమోదు చేసి ఫలితాలు చూసుకోవచ్చని ఆమె సూచించారు.

## నేటి నుంచి 'టోల్' చార్జీల పెంపు

ఇందల్వాయి, మార్చి 31 : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) సవరించిన టోల్‌ప్లాజా చార్జీలు నేటి నుంచి అమలుకానున్నాయని ఇందల్వాయి టోల్‌ప్లాజా మేనేజర్ జలపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కారు, జీపు, వ్యాన్ లేదా తేలిక పాటి మోటార్ వాహనానికి 90 రూపాయలు, 24 గంటల లోపు తిరుగు ప్రయాణానికి 130 రూపాయలు వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఆశీర్వదించండి.. పనిచేసి చూపిస్తా..

**బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**

సిరికొండ, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ఇంతవరకు ఏ ఎంపీలు చేయలేని పనులు చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు చేసే అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పటిష్టంగా ఉన్నదని, వచ్చే ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందన్నారు. ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ ఐదేండ్లలో జిల్లాకు చేసిన పని ఏం లేదని, ఆయనను కాకుండా మోదీని చూసి ఓటు వేయాలని అడుగుతున్నారని విమర్శించారు. జిల్లాకు చేసిన పనులను చూపించి ఓట్ల కోసం రావాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

## రేపు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

వినాయక్‌నగర్, మార్చి 31: సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు పోలీస్ శాఖ వెలుసుబాటు కల్పిస్తున్నది. బాధితులు నేరుగా ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ కమిషనరేట్‌లోనే ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ స్టేషన్‌ను ఈ నెల 2వ తేదీన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ స్టేషన్‌లో రూ.లక్ష నుంచి అంతకన్నా ఎక్కువగా సైబర్ నేరాలకు గురైతే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుంది. బాధితులు చేసిన ఫిర్యాదుపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేస్తామని, రూ.లక్ష కన్నా తక్కువగా ఉన్న సైబర్ నేరాలపై బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్ లోనే ఫిర్యాదు చేయవచ్చని సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే బాధితులు 1930కి కాల్ చేయడం లేదా www.cybercrime. gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయొచ్చని వివరించారు.




ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈస్టర్ సండే వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఈస్టర్ సండే ప్రాశస్త్యాన్ని వివరించారు. నిజామాబాద్ నగరంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. –ఖలీల్‌వాడి, మార్చి 31

